17022024-DIS-08_Layout 1 2/17/2024 2:29 AM Page 1

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

జాగ్రఫీని సృష్టించిన కేసీఆర్

సంగారెడ్డి టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం జరుగుతున్నదని తెలిసి అందరితో పాటు నేనూ వెళ్లాను. 'మీలో ఆంధ్రభూమి రిపోర్టర్ ఎవరు?' అంటూ మెదక్ జిల్లా టీడీపీ అధ్యక్షుడు ప్రశ్నించేసరికి 'నేనే' అని పరిచయం చేసుకున్నా. ఇది 1989లో అంటే దాదాపు మూడున్నర దశాబ్దాల కిందటి సంఘటన. అప్పుడు టీవీ చానల్స్ లేవు. నాలుగైదు ప్రధాన పత్రికల విలేకరులే ఉండేవారు. సాధారణంగా రాజకీయ నాయకుల విలేకరుల సమావేశంలో ఆ కాలంలో 'ఈనాడు రిపోర్టర్ వచ్చాడా? లేదా' అని విచారించేవారు. కానీ, ప్రత్యేకంగా ఆంధ్రభూమి రిపోర్టర్ ఎవరు? అని అడిగింది.. అప్పుడు మెదక్ జిల్లా టీడీపీ అధ్యక్షునిగా ఉన్న కల్వకుంట్ల చంద్రశేఖరరావు. అలా అడగడానికి ఓ కారణం ఉంది.

1989లో టీడీపీ ఓడిపోయింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఎన్టీఆర్ దిగిపోయి, మర్రి చెన్నారెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. జిల్లా సహకార బ్యాంకులకు ఎన్నికలు జరిగాయి. సాధారణంగా ఏ పార్టీ అధికారంలో ఉంటే.. అన్ని జిల్లాల సహకార బ్యాంకుల అధ్యక్షులుగా ఆ పార్టీ వారే ఎన్నికవుతారు. ఉమ్మడి రాష్ట్రంలో 22 జిల్లా సహకార బ్యాంకులు ఉండగా.. 21 చోట్ల కాంగ్రెస్ వారే అధ్యక్షులయ్యారు. ఒక్క మెదక్ జిల్లాలో మాత్రం కాంగ్రెస్ పార్టీ నిలబెట్టిన అభ్యర్థి ఓడిపోయారు. కేసీఆర్ నిలబెట్టిన కాంగ్రెస్ నేత జిల్లా సహకార బ్యాంకు చైర్మన్‌గా ఎన్నికయ్యారు. 'కేసీఆర్ ఎలాంటి వ్యూహం పన్నారు. టీడీపీ నిలబెట్టిన కాంగ్రెస్ నేత ఎలా గెలిచారు' అనే కోణంలో నేను ఆర్టికల్ రాశాను. 21 జిల్లాల్లో కాంగ్రెస్ వారు గెలిస్తే ఒక్క జిల్లాలో మాత్రం టీడీపీ నిలబెట్టిన కాంగ్రెస్ నేత గెలవడం రాజకీయంగా ఆసక్తి అనిపించింది. అందుకే అదే రాశాను. ఆ వార్త కేసీఆర్‌కు బాగా నచ్చింది. అందుకే అలా అడిగారు. కేసీఆర్‌తో నాకు అదే తొలి పరిచయం. మెదక్ జిల్లా కేంద్రం సంగారెడ్డి అయినా.. వార్తలపరంగా సిద్దిపేటకు, సంగారెడ్డికి సంబంధాలు అంతంతమాత్రమే.



బుద్ధా మురళి

ఆంధ్రభూమి రిపోర్టర్‌గా 1995లో హైదరాబాద్‌కు వెళ్లాను. హైదరాబాద్ వచ్చిన నెలకే టీడీపీ కార్యక్రమాల బాధ్యతలు అప్పగించారు. మరో నెల రోజులకే ఎన్టీఆర్‌ను దించిన వైస్రాయ్ ఉదంతం జరిగింది. చంద్రబాబు సీఎం అయ్యాక కేసీఆర్ రవాణా శాఖ మంత్రి అయ్యారు. క్యాబినెట్ సమావేశం జరిగిందంటే చాలు.. కేసీఆర్ చాంబర్ కిక్కిరిసిపోయేది. కేసీఆర్ సీఎం అయ్యాక మీడియాను దూరం పెట్టారని నమ్మేవారికి ఇది నమ్మబుద్ధి కాదు. అప్పట్లో ఆయన చాంబర్‌లో విలేకరుల జాతర ఉండేది. 30-40 మంది జర్నలిస్టులు క్యాబినెట్‌లో ఏం జరిగిందో తెలుసుకోవడానికి వెళ్లేవారు. కేసీఆర్ వారికి సుదీర్ఘంగా వివరించేవారు. ఆర్థిక సంస్కరణలు, ప్రభుత్వం ఎలా పని చేయాలి? మారిన కాలంలో పాలనలో ప్రభుత్వ జోక్యం తక్కువగా ఉండడం ఎలానో చెప్తుండేవారు. ఒకే ఒక సమస్య ఎదురయ్యేది. జర్నలిస్ట్‌కు కావాల్సింది క్యాబినెట్ సమావేశంలో ఏం జరిగిందనేది మాత్రమే. కేసీఆర్ చెప్పే అనేక అంశాల నుంచి క్యాబినెట్ వివరాలను వేరు చేసుకోవాలి. ఏ మంత్రి వద్దకు వెళ్లినా క్యాబినెట్‌లో ఏం జరిగిందనే నాలుగు ముక్కలు తెలుసుకొని రావడమే. కానీ, కేసీఆర్ వద్దకు వెళ్తే మాత్రం అనేక అంశాలపై చర్చ ఉండేది.

> వచ్చిన జర్నలిస్ట్ పెద్ద పత్రికకు చెందినవాడా? చిన్న పత్రికకు చెందినవాడా? పరిచయం ఉందా? లేదా? అనే దానితో సంబంధం లేదు. అంతకుముందు క్యాబినెట్ సమావేశం వివరాలు ముగ్గురు, నలుగురు జర్నలిస్టులకే పరిమితమయ్యేవి. వారికే గుత్తాధిపత్యం అన్నట్టు ఉండేది. కేసీఆర్ మంత్రి అయ్యాక క్యాబినెట్ వివరాలంటే అందరికీ అన్నట్టు మారింది. దీంతో బాబు సన్నిహిత జర్నలిస్టులు.. క్యాబినెట్ వివరాలను కేసీఆర్ అందరికీ చెప్తున్నారు అని ఫిర్యాదు చేసేవారు. దాంతో ఒకటి రెండు సార్లు చెప్పలేదు.. ఆ తర్వాత మామూలే. మళ్లీ జర్నలిస్టుల జాతర షురూ.

2001లో టీఆర్ఎస్ ఆవిర్భవించింది. అయితే కేసీఆర్ మంత్రిగా ఉన్నప్పుడే దీనికి సంబంధించి ప్రాథమిక ప్రయత్నాలు జరిగాయి. ఆంధ్రభూమిలోనే రిపోర్టర్‌గా ఉన్న కేఎన్ చారిని ఓసారి నేనే కేసీఆర్‌కు పరిచయం చేశా. ఒకసారి పరిచయం అయితే చారి దూసుకెళ్తారు. అనేక అంశాలపై విస్తృతంగా చర్చించడానికి ఖర్చు భరించి మరీ ఓ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు కేసీఆర్. అక్కడ దేశంలో పేదరికం, వెనుకబడిన ప్రాంతాలు, నక్సలిజం, తెలంగాణ వంటి అనేక అంశాలపై చర్చలు జరిగేవి.

1999లో టీడీపీ రెండోసారి గెలిచాక కేసీఆర్‌కు మంత్రి వర్గంలో స్థానం లభించలేదు. మంత్రివర్గ జాబితాలో కేసీఆర్ పేరు లేకపోవడంతో సిద్దిపేట నుంచి వచ్చిన కొంతమంది మహిళలు రాజ్‌భవన్‌లోని పూలకుండీలను తోసేశారు. సినిమాల్లో భవిష్యత్తు సంఘటనలను సూచించడానికి కొన్ని సంకేతాలు చూపుతారు. ఆ రోజు రాజ్‌భవన్‌లో పగిలిన పూలకుండీలు భవిష్యత్తు రాజకీయాలకు సంకేతమని నాకనిపించింది. ఆ తర్వాత కేసీఆర్‌కు డిప్యూటీ స్పీకర్ పదవి ఇచ్చారు. ప్రత్యేక తెలంగాణ డిమాండ్‌తో కేసీఆర్ ఉద్యమించనున్నారని అప్పటికే ప్రచారం జరుగుతున్నది. అయితే ఆ ప్రచారానికి అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు పెద్దగా ప్రాధాన్యత ఇవ్వలేదు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతుండగానే కేసీఆర్ డిప్యూటీ స్పీకర్‌గా తన చాంబర్‌లో రాజకీయ పరిణామాలపై మాట్లాడారు. అక్కడకు కాంగ్రెస్ బీట్ రిపోర్టర్లు కూడా వచ్చారు. పార్టీలో అసంతృప్తితో ఉన్నవారి గురించి చెప్పడంతో పాటు తెలంగాణ డిమాండ్ గురించి ప్రస్తావించారు. కాంగ్రెస్ బీట్ రిపోర్టర్లు మాత్రం 'టీడీపీలో చీలిక' అని వార్త రాస్తే, టీడీపీ బీట్ రిపోర్టర్లు 'కేసీఆర్ తెలంగాణ ఉద్యమం ప్రారంభించనున్నారు' అని రాశారు.

టీఆర్ఎస్ పుట్టిన వంద రోజులకే స్థానిక సంస్థల ఎన్నికలు వచ్చాయి. కేసీఆర్ హెలికాప్టర్‌లో ప్రచారానికి వెళ్తున్నారు.. అనే వార్త పెద్ద సంచలనంగా మారింది. అందరూ వ్యతిరేకంగా మాట్లాడుతుంటే నేను ఒకటే చెప్పా.. 'తెలంగాణ అంటే అందరికీ చిన్నచూపు. ఆ భావనను పోగొట్టాలి. హెలికాప్టర్‌లో ప్రచారం సరైన నిర్ణయం' అని. ప్రచారానికి వెళ్తూ నన్నూ తీసుకువెళ్లారు. సాధారణంగా ఎక్కువ సర్క్యులేషన్ ఉన్న పత్రికల రిపోర్టర్లనే తీసుకెళ్తారు. కానీ, కేసీఆర్ మాత్రం కవరేజ్ కోసం కాకుండా మాట్లాడుతూ వెళ్లవచ్చు అని నన్ను తీసుకెళ్లారని నాకు అర్థమైంది. జర్నలిస్ట్‌గా మూడున్నర దశాబ్దాల పరిచయంలో 'ఇలా రాయమని, అలా ఎందుకు రాశావు' అని ఒక్కసారి కూడా అడగలేదు. నేను పని చేసే ఆంధ్రభూమి ఓనర్, సంపాదకుడు తెలంగాణ ఏర్పాటుకు వ్యతిరేకం. కానీ, నేను తెలంగాణ కోరుకున్నాను. ఒక్కసారి కూడా 'పత్రికలో అలా ఎందుకు రాస్తున్నారు' అని కేసీఆర్ అడగలేదు.

నేడు కేసీఆర్ జన్మదినం

తెలంగాణ ఉద్యమకాలంలో గద్దర్ మొదలుకొని ఎంతో మందితో మాట్లాడే అవకాశం నాకు లభించింది. బాగ్‌లింగంపల్లిలోని ఓ హాలులో 1969 నాటి ఉద్యమకారులతో సమావేశం జరిగింది. గద్దర్‌ను కలిసి తెలంగాణ వస్తుందా? అని ఆసక్తిగా అడిగితే 'ఆంధ్ర లాబీ రానివ్వదు, రాదు' అని అన్నారాయన. సకలజనుల సమ్మె సమయంలో కూడా ఉద్యమంలో నాయకులుగా ఉన్నవారు సైతం 'తెలంగాణ రాదు' అనే భావించేవారు. ఉద్యమ సన్నాహక సమయంలో నేను కూడా 'తెలంగాణ ప్రజలు తెలంగాణ కోరుకుంటున్నారు, కానీ తెలంగాణ రాదు' అని చెప్పాను.

> కానీ, ఉద్యమం మొదలైనప్పటి నుంచి ఏ ఒక్కసారి కూడా కేసీఆర్ 'తెలంగాణ రాదు' అని అనలేదు. జర్నలిస్ట్ మిత్రుడు వై.నాగేశ్వరరావు ఓ సారి 'సార్ (కేసీఆర్)తో మాట్లాడినంత సేపు తెలంగాణ వస్తుందన్న నమ్మకం కలుగుతుంది.. బయటకు వచ్చి ఎవరితో మాట్లాడినా తెలంగాణ రాదనిపిస్తుంది. అదేంటో' అని మనసులో మాట చెప్పారు. నిజానికి అందరి అభిప్రాయం అదే. కేసీఆర్‌తో కొద్దిసేపు మాట్లాడితే చాలు తెలంగాణ వస్తుందన్న నమ్మకం కలిగేది. ఏ పార్టీ నాయకుడికీ అంత నమ్మకం ఉండేది కాదు. విశ్లేషణ శక్తి ఉండేది కాదు. రాజకీయ వ్యూహం ద్వారా తెలంగాణ ఎలా సాకారం అవుతుందో కేసీఆర్ అద్భుతంగా చెప్పేవారు.

గతంలో మహా టీవీకి చెందిన ఐ.వెంకట్రావుతో మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి ఓ మాట చెప్పారు. 'మేం ప్రత్యర్థి పార్టీ కాబట్టి విమర్శిస్తాం కానీ, కేసీఆర్ మొండి పట్టుదల వల్లనే తెలంగాణ కల సాకారమైంది' అని రేవంత్‌రెడ్డి అన్నారు. సినీ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ ఓ సమావేశంలో మాట్లాడుతూ 'చరిత్రను సృష్టించినవారు ఉంటారు. కానీ, కేసీఆర్ జాగ్రఫీని సృష్టించారు' అని తెలంగాణ కల సాకారం చేయడాన్ని ప్రస్తావిస్తూ ఆయన వ్యాఖ్యానించారు.

> 2001లో టీఆర్ఎస్ ఆవిర్భావం తర్వాత ఆ పార్టీ ఎన్నో ఆటుపోట్లను చూసింది. జనాకర్షణ గల వైఎస్ఆర్‌ను సైతం తట్టుకొని కేసీఆర్ తెలంగాణ ఉద్యమాన్ని నిలబెట్టారు. ఓటమి రాటు తేలేట్టు చేస్తుంది. తప్పులను సరిదిద్దుకొనే అవకాశం ఇస్తుంది. లేచి నిలబడే ఆత్మస్థైర్యాన్ని ఇస్తుంది. కాలం అన్నింటికీ సమాధానం చెప్తుంది. కేసీఆర్ తెలంగాణ సంపద. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ఉద్యమం, సోనియాగాంధీ.. ఇద్దరిలో ఎవరు లేకపోయినా తెలంగాణ సాకారం అయ్యేది కాదు. ఓటమి సైతం కొన్నిసార్లు మంచి చేస్తుంది. మనల్ని మనకు కొత్తగా పరిచయం చేస్తుంది. ఏడు పదుల వయసులో కేసీఆర్ తెలంగాణ కోసం మరోసారి తన వ్యూహాలకు పదును పెడతారు. కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు.

ఆ పిలుపు.. ఓ పులకింత

> సరిగ్గా కేసీఆర్ మలిదశ తెలంగాణ ఉద్యమానికి ఓ రూపునిస్తున్న 2001లో.. నేను వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్ష బాధ్యతలు నిర్వర్తిస్తున్నా. తెలంగాణకు అనుకూలంగా తీర్మానం చేసిన మొదటి బార్ అసోసియేషన్‌గా వరంగల్ నిలిచిన నేపథ్యంలో నాటి ఉద్యమ నాయకుడు కేసీఆర్‌తో నాకు పరిచయం ఏర్పడింది. సహచర న్యాయవాది, రాష్ట్ర ప్రణాళిక సంఘం మాజీ ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ ద్వారా కేసీఆర్‌ను కలుసుకున్నా.

ముద్దసాని సహోదర్‌రెడ్డి

మా స్వగ్రామం దామెర సర్పంచ్‌గా పని చేసిన నేను.. మన ప్రాంతానికి జరిగిన అన్యాయాన్ని, ఆర్థిక నష్టాన్ని ప్రత్యక్షంగా చూశా. ఎదిరించిన యువకులను ఎన్‌కౌంటర్ పేరిట కాల్చి చంపడాన్ని చూసి చలించిపోయా. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటే తెలంగాణ సమస్యలకు పరిష్కారమని భావిస్తున్న తరుణంలో.. తెలంగాణ సాధనే లక్ష్యంగా పోరాటాన్ని ప్రారంభించిన కేసీఆర్‌తో సాన్నిహిత్యం ఏర్పడింది. తెలంగాణ వెనుకబాటుకు గల కారణాలను విశ్లేషించడంలో, ప్రజలకు అర్థమయ్యేలా చెప్పడంలో, కార్యకర్తలను కార్యోన్ముఖులను చేయడంలో కేసీఆర్‌కు గల నేర్పును చూసిన తర్వాత నేనూ ఆయన అడుగులో అడుగేశాను. ఇప్పటికీ ఆయన చూపిన బాటలోనే ప్రయాణం కొనసాగిస్తున్నా.

ఆనాడు కరీంనగర్‌లో జరిగిన మొట్టమొదటి మీటింగ్‌లోనే టీఆర్ఎస్‌లో చేరా. ఆ సందర్భంగా ఒక ఇంగ్లిష్ పత్రికలో 'కేసీఆర్ అమ్ములపొదిలో చేరిన మరో బాణం సహోదర్‌రెడ్డి' అని వార్త వచ్చింది. దాన్ని నిజం చేసేలా రేయింబవళ్లు కేసీఆర్ ఆదేశాలకు అనుగుణంగా ఉద్యమ నిర్మాణంలో పాలుపంచుకున్నా. కేసీఆర్ మాటలకు ప్రభావితమై న్యాయవాద కార్యాలయాన్ని వరంగల్ జిల్లా పార్టీ ఆఫీసుగా మార్చేశా. పార్టీ ఏర్పాటైన తొలినాళ్లలోనే ఎదుర్కొన్న స్థానిక సంస్థల ఎన్నికల్లో టీఆర్ఎస్‌కు కారు గుర్తు కేటాయించడాన్ని సవాల్ చేస్తూ ఓ వ్యక్తి కోర్టులో కేసు వేశారు. దీంతో హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ న్యాయవాది సత్యంరెడ్డితో కలిసి పార్టీకి కారు గుర్తు దక్కేలా చేయడం కోసం కోర్టులో పోరాడాను. ఆ ఘటన నా జీవితంలో ఒక మధురానుభూతి.

నేను, దివంగత ప్రొఫెసర్ బియ్యాల జనార్దన్‌రావు యువకులను వెదికివెదికి పార్టీలో చేర్పించేవాళ్లం. పెద్ది సుదర్శన్‌రెడ్డిని పార్టీలో చేర్పించింది మేమే. ఆనాటి సమైక్య పాలకుల కుట్రలను చేధించడం కోసం ఎందరెందరో తెలంగాణ అభిమానులు, మేధావుల సూచనలు, సలహాలను కేసీఆర్ స్వీకరించేవారు. ఆ క్రమంలోనే తెలంగాణ పట్ల అత్యంత ప్రేమాభిమానాలు కలిగిన అప్పటి సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లింగాల నరసింహారెడ్డిలతో సంబంధాలు ఏర్పడ్డాయి. ఉద్యమ సమయంలో వారు చేసిన ప్రత్యక్ష, పరోక్ష సాయాన్ని తెలంగాణ సమాజం ఎన్నడూ మర్చిపోదు. అటువంటి పవిత్ర కార్యంలో నేనూ పాలుపంచుకోవడం నా అదృష్టంగా భావిస్తున్నా.

నా పట్ల అత్యంత ప్రేమ కలిగిన కేసీఆర్ పలుమార్లు ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పించారు. ఉద్యమంలో అత్యంత క్రియాశీలక పాత్ర పోషించిన న్యాయవాదుల సంక్షేమం కోసం రూ.100 కోట్లు కేటాయించాలన్న నా సూచనను మన్నించారు. రూ.100 కోట్ల నిధిని సమకూర్చారు. ఆ ట్రస్టులో బాధ్యతలూ అప్పగించారు. నా కోరిక మేరకు మా స్వంత గ్రామం దామెరను మండలంగా ప్రకటించారు.

> క్రమశిక్షణకు, పట్టుదలకు చిరునామా.. మిత్ర వాత్సల్యానికి పర్యాయపదంగా నిలిచే ఏకైక ప్రజా నాయకుడు కేసీఆర్. ఉద్యమం నాటి నుంచి నేటి ప్రతిపక్ష ప్రస్థానం వరకు అపజయాలకు కుంగిపోకుండా, విజయాలకు పొంగిపోకుండా స్థితప్రజ్ఞతతో ముందుకు సాగుతున్న ప్రజానాయకుడు కేసీఆర్. ఇప్పటికీ ఎక్కడ ఎదురైనా 'సహోదరన్నా' అని మనసారా నన్ను సంబోధించే కేసీఆర్ పలకరింపు నాకు ఒక పులకింత. ఒక గొప్ప అనుభూతి. కేసీఆర్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు.

అవిశ్రాంత యోధుడు

ముక్కామల చక్రధర్
99120 19929

> రెండున్నర దశాబ్దాల కిందటి మాట. ఉమ్మడి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి చాంబర్ అది. ఆ శాఖకు మంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు. ఓ పత్రికలో రిపోర్టింగ్ బాధ్యతల్లో ఉన్న నేను.. రవాణా శాఖ కార్యక్రమాలను చూసేవాడిని. ఆ కారణంగా సచివాలయానికి రోజూ వెళ్లేవాడిని. ముఖ్యంగా సచివాలయంలో ప్రెస్ రూం కళకళలాడుతూ ఉండేది.

రిపోర్టర్‌ను కావడంతో కేసీఆర్‌ను తరచూ కలిసేవాడిని. నేను కనపడగానే కేసీఆర్ తొలి పలకరింపు 'రా.. చక్రి. గింత అన్నం తిందాం' అని. ఇతర పత్రికల రిపోర్టర్ మిత్రులను కేసీఆర్ అలాగే ఆహ్వానించేవారు. ఆయనే స్వయంగా వడ్డించేవారు. ఇదంతా ఎందుకు చెప్తున్నానంటే, ఆనాటి మంత్రి, ఉద్యమ నాయకుడు, పదేండ్ల పాటు ముఖ్యమంత్రిగా పని చేసిన కేసీఆర్ గురించి చెప్పడానికే.

పదవుల్లో ఉన్నవారు ప్రత్యేకించి శత్రువులను తయారు చేసుకోనవసరం లేదు. వారి ఉన్నతిని చూసి, ప్రజల్లో ఉన్న అభిమానాన్ని చూసి శత్రువులు తయారైపోతారు. కేసీఆర్ రాజకీయ జీవితం, ఉద్యమకాలం గురించి చెప్పేందుకు పెద్దగా ఏమీ ఉండదు. వాటి గురించి దేశవ్యాప్తంగా అందరికీ తెలిసిందే. తెలియాల్సింది ఆయన వ్యక్తిత్వమే. ప్రత్యేక తెలంగాణ పట్ల, తెలంగాణ ఉద్యమం పట్ల నాకు అమితమైన ప్రేమ ఉండేది. ఉద్యమానికి ముందే, సమైక్య రాష్ట్రానికి మంత్రిగా ఉన్నప్పుడే కేసీఆర్‌కు తెలంగాణ పట్ల విపరీతమైన ప్రేమ ఉండేది. అలాగని, సమైక్య రాష్ట్రంలోని ఆంధ్రుల పట్ల వ్యతిరేకత నాకెక్కడా కనిపించలేదు. ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చి తెలంగాణలో సెటిల్ అయి బతుకుతున్న వారినెవ్వరినీ కేసీఆర్ ఎప్పుడూ పల్లెత్తు మాట అనలేదు.

> మరో ముఖ్యమైన విషయం.. నాకు తెలిసినంత వరకు చంద్రబాబు నాయుడు, కేసీఆర్‌కు మంత్రి పదవి ఇవ్వకపోవడం వల్ల తెలంగాణను భుజాలకెత్తుకున్నారని అటు తెలంగాణ వాదుల్లో కొందరు, ఇటు సమైక్య వాదుల్లో కొందరు అంటుంటారు కానీ, అది నిజం కాదు. ఈ విషయం కేసీఆర్‌కు బాగా సన్నిహితంగా మెలిగిన వారికి తెలుసు.

చంద్రబాబు నాయుడి మంత్రివర్గ సమావేశం తర్వాత జరిగే విలేకరుల సమావేశానికి కొందరు విలేకరులు వెళ్లేవారు. మరికొందరు లోపల ఏం జరిగిందో తెలుసుకునేందుకు మంత్రుల వద్దకు వెళ్లేవారు. మంత్రుల్లో చాలామంది సమావేశంలో ఏం జరిగిందో పూసగుచ్చినట్టు విలేకరులకు చెప్పేవారు. కేసీఆర్ కూడా చెప్పేవారు. కానీ, అది ప్రజలకు సంబంధించినదే అయ్యేది తప్ప మిగిలినవి చెప్పేవారు కాదు. ప్రభుత్వానికి సంబంధించిన కీలక విషయాలు మాత్రం వెల్లడించేవారు కాదు. ఇదే సమయంలో మిగిలిన మంత్రులు మాత్రం వారి కంచెను దాటి మరీ అంతా పూసగుచ్చినట్టు చెప్పేసేవారు. ఉదయాన్నే పత్రికల్లో మంత్రివర్గ అంతర్గత సమావేశాలకు సంబంధించిన వార్తలు పతాక శీర్షికల్లో వచ్చేవి. ఆ అపవాదంతా కేసీఆర్‌పై పడేది. అయినా, ఓ బాధ్యతని భుజానికెత్తుకున్న కేసీఆర్.. 'మౌనమే నా భాష అన్నట్టు'గా ఉండేవారు. ఇది ఆయనకు తన బాధ్యతల పట్ల ఉన్న గౌరవంగానే చూడాలి. బహుశా ఆ బాధ్యతాయుతమైన వ్యక్తిని చూశారు కనుకే తెలంగాణ ప్రజలు తమ చిరకాల ఆకాంక్షను ఆయన భుజాలపై పెట్టారేమో.

ఇక్కడ కూడా దశాబ్ద కాలానికి పైగా ఆ భుజాలు అలసిపోలేదు. ఆ కలను మధ్యలోనే వదిలేయలేదు. ఇదే కేసీఆర్‌ను తెలంగాణకు తొలి ముఖ్యమంత్రిని చేసింది. ఓ ఉద్యమాన్ని ఎలా ముందుకు తీసుకువెళ్లాలి.. దాన్ని ఎలా విజయం దిశగా ఎలా పరుగెత్తించాలో నేటి తరానికి తెలియజేసింది నిస్సందేహంగా కేసీఆరే. రాష్ట్రం విడిపోయిన తర్వాత ఆంధ్ర ప్రజలంతా కేసీఆర్‌కు వ్యతిరేకమని రాజకీయ నాయకులు, మేధావులు భావించారు. నిజానికి, విడదీసిన వారిపైనే కోపం ప్రదర్శించారు ఆంధ్రప్రదేశ్ ప్రజలు. సెటిలర్లు గంపగుత్తగా కేసీఆర్‌కు పట్టం కట్టడమే దీనికి తార్కాణం. ఐదేండ్ల కేసీఆర్ పాలన తర్వాత ఓ బక్కపలచని వ్యక్తిని ఓడించేందుకు సిద్ధాంతాలను పక్కనపెట్టి కలిసిన తొమ్మిది పార్టీలు కూడా కేసీఆర్‌ను ఓడించలేకపోయారంటేనే ప్రజల ప్రేమను అర్థం చేసుకోవచ్చు.

ఈ మధ్య జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ పరాజయం పాలైతే.. ఓ సీనియర్ జర్నలిస్టు మిత్రుడు నాకు ఫోన్ చేసి 'మీ కేసీఆర్ ఓడిపోయారుగా, గులాబీ రంగు వెలిసిపోయిందిగా' అని అన్నారు. 'అది ఓటమి కాదు.. రెండున్నర దశాబ్దాల అలుపెరుగని ఓ యోధునికి ప్రజలు కొన్నేండ్ల పాటు ఇచ్చిన విశ్రాంతి' అని చెప్పా. ఇక గులాబీ రంగు వెలిసిపోవడం అంటావా.. 'అది రంగు కాదు.. తెలంగాణ ప్రజలు తొడిగిన కవచ కుండలం' అని అన్నాను.

తెలంగాణకు నాంది.. సీఎస్ఎస్

> నవంబర్ 28న రాత్రి 8.30 గంటల సమయంలో ముఖ్యమంత్రి కేసీఆర్ నుంచి నాకు ఫోన్ వచ్చింది. చాలా సంతోషించాను. ఆయన నాతో 'కొద్దిసేపటి కిందట జరిగిన విలేకరుల సమావేశం టీవీలో చూశావా' అని అడిగారు. నేను లేదని చెప్పా. 1996-97లో సెంటర్ ఫర్ సబాల్టర్న్ స్టడీస్‌లో (సీఎస్ఎస్) జరిపిన చర్చల గురించి ఆ సమావేశంలో ప్రస్తావించినట్టు కేసీఆర్ చెప్పారు.

ఎస్. రామకృష్ణ

ఉమ్మడి రాష్ట్రంలోని టీడీపీ ప్రభుత్వంలో రవాణా శాఖ మంత్రిగా ఉన్న కేసీఆర్ సీఎస్ఎస్ ఏర్పాటులో, నిర్వహణలో ఎంతగానో సహకరించారు. అప్పుడు నేను ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో పని చేస్తున్నాను. నాతో పాటు మరో సీనియర్ జర్నలిస్టు ఉండేవారు. నేను, దివంగత కేఎన్ చారి (ఆంధ్రభూమి) రోజువారీ నిర్వహణ బాధ్యతలను చూసుకునేవాళ్లం. ప్రధానంగా, సీఎస్ఎస్ లక్ష్యం ఏమిటంటే.. ఆలోచనాపూర్వకమైన చర్చలు జరిపి, ప్రత్యేక తెలంగాణ సాధించడానికి మార్గాలను అన్వేషించడం.

సీఎస్ఎస్‌ను అధికారికంగా ప్రారంభించే ముందు సచివాలయంలోని కేసీఆర్ చాంబర్‌లో అనేక తడవలు చర్చలు నిర్వహించాం. భావసారూప్యత కలిగిన కొందరం తెలంగాణ గురించి మాట్లాడుకునేందుకు ఒక వేదికను ప్రారంభించాలని మొదట అనుకున్నాం. కానీ, సమాజంలో అణచివేతకు గురవుతున్న అన్నివర్గాల సమస్యలను కూడా మేధోమథనంలో భాగం చేయాలని కేసీఆర్ సూచించారు. అందుకే సెంటర్ ఫర్ సబాల్టర్న్ స్టడీస్ అనే పేరును ఆ సంస్థకు పెట్టాం.

కేసీఆర్ అధికారిక నివాసమైన మెట్టుగూడలోని ట్రాన్స్‌పోర్ట్ భవన్‌లో సీఎస్ఎస్‌కు సంబంధించిన అంశాలు చర్చించేందుకు అనేకసార్లు సమావేశమయ్యాం. నాటి ఓయూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ రామకిష్టయ్య, హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సర్దార్ అలీఖాన్, పౌరహక్కుల కార్యకర్త కన్నాబిరాన్, ప్లానింగ్ కమిషన్ మాజీ సభ్యులు సీహెచ్ హనుమంతరావు వంటి హేమాహేమీలందరూ సీఎస్ఎస్‌కు వచ్చినవారే. ప్రముఖ మేధావులు గెయిల్ ఓమ్‌వెట్, అరుణ్ శౌరీ, అస్ఘర్ అలీ ఇంజినీర్, ప్రొఫెసర్ ఎఫ్‌డీ వకీల్, ప్రొఫెసర్ కంచె ఐలయ్య, బీడీ శర్మ, డాక్టర్ కె.బాల్‌గోపాల్ వంటివారు ఉమ్మడి రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలు, సమస్యలపై సమర్పించిన పేపర్లను కూడా సేకరించాం. తెలంగాణ ఉద్యమాన్ని ప్రారంభించాలని భావించినప్పుడు నాటి శాసనసభ్యులు పి.ఇంద్రారెడ్డి కూడా మేం చేస్తున్న పనేమిటో, ఎలా చేస్తున్నామో తెలుసుకోవడానికి సీఎస్ఎస్‌కు వచ్చారు.

వివిధ రంగాల్లో తెలంగాణకు జరిగిన, జరుగుతున్న అన్యాయం గురించి నాటి సీఎం కార్యాలయంలో కేసీఆర్ బహిరంగంగా విభేదించేవారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడమే వీటన్నింటికీ పరిష్కారమని ఆయన అప్పుడే భావించారు. తెలంగాణ వెనుకబాటుతనంపై ఎటువంటి చర్చను అనుమతించేందుకు చంద్రబాబు ప్రభుత్వం సిద్ధంగా లేని కాలమది.

> సభలో తెలంగాణపై చర్చకు అనుమతించబోమంటూ నాటి అసెంబ్లీ స్పీకర్ వై.రామకృష్ణుడు తిరస్కరించారు. తెలంగాణ అన్న పదానికి బదులుగా వెనుకబడిన ప్రాంతాలు అన్నమాట ఉపయోగిస్తేనే చర్చకు అనుమతిస్తామని రామకృష్ణుడు సభలో ప్రకటించారు. నాటి స్పీకర్ రూలింగ్‌ను తీవ్రంగా పరిగణించిన అతి తక్కువమంది నాయకులలో కేసీఆర్ ఒకరు.

2000లో విద్యుత్తు ధరలను పెంచినప్పుడు దానితో విభేదిస్తూ సీఎంకు బహిరంగ లేఖను రాయడం ద్వారా చంద్రబాబుతో తనకున్న అభిప్రాయభేదాలను కేసీఆర్ బట్టబయలు చేశారు. ప్రధానంగా బోరుబావులపై ఆధారపడి వ్యవసాయం చేసుకునే తెలంగాణ ప్రజలపై విద్యుత్తు ధరల పెంపు పర్యవసానం ఎలా ఉంటుందనే విషయాన్ని అత్యంత శ్రద్ధతో అధ్యయనం చేశారాయన. అధికార పార్టీ నుంచి ఈ నిర్ణయాన్ని మొట్టమొదట వ్యతిరేకించిన వ్యక్తి కేసీఆరే.

కేసీఆర్ రాజకీయ జీవితంలో ఆ లేఖే గొప్ప మలుపు అని చెప్పాలి. నిద్రాణంగా ఉన్న ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాన్ని పునరుద్ధరించాలని అప్పుడే ఆయన నిర్ణయాత్మక వైఖరి తీసుకున్నారు. చాలామంది అపనమ్మకంతో చూశారు. కానీ, ఆయన తన నిర్ణయంపై దృఢ సంకల్పంతో ముందుకెళ్లారు. అలా 2001లో తెలంగాణ రాజకీయ ఉద్యమానికి తెరలేపారు. చర్చలు, వాదోపవా